# బెడిసి కొట్టిన జాలిగుండె

కె. ఆర్. రెడ్డి

స్కెచ్

ఒడిసి ఒడిసీ కొడుతూన్న ఈదరగాలి. జడిపట్టి కురుస్తూన్న వాన తుంపరలు. చలి ఎముకలు కొరికేస్తోంది. కండలు చివికేస్తోంది. గుండెలుతీసి గుప్పెట్లో దాచుకున్నా ఆగని చలిబాధ అంతరాంతరాల్లోను అలుముకు పోతోంది. ఝుంయిమని ఒకటే హోరు.

రైలుబండికి ఈ ధ్యాసే లేదు. గుండెల్లో మండుతూండే రాక్షసిబొగ్గు ఆసరాగా ఆదుకుంటుంది. నిర్లక్ష్యంగా ఛాతీ విరచుకుని ఖాతరు చేయకుండా "మీకు చలివేస్తూందేమిటి!" అంటూ అవహేళనగా ముఖం తిప్పుకుని పరుగెడుతోంది.

"హామయ్యా!... బాబ్బాబు!...హామ్మం..."

వాతావరణ వైపరీత్యానికి రైలుపెట్టె మూలభాగంలో ముడుచుక కూర్చున్న మూడుకాళ్ళ ముసలమ్మ నకనకలాడిపోతోంది. ఎముకలు కొరికే చలి. కండలు చివికేస్తుంది. గజగజలాడించి గజ్జె కడుతుంది. పేదసాదలు - చిన్నపెద్దలు—గౌరవ మర్యాదలు—వాటితో దానికి నిమిత్తంలేదు. దయలు — దాక్షిణ్యాలు — సహకారాలు — సానుభూతులు దాని చరిత్రలోనే లేవు. అందరిపైనా ఒకే ప్రయోగము. ఒకే ప్రయోజనము.

జడివానలో తడిసి వచ్చిన బురదకాళ్ళతో రైలుపెట్టె అంతా రొచ్చురొచ్చుగా తయారైంది. ఎవళ్ళగొడవ వాళ్ళది. ఎవళ్ళ సౌకర్యం వాళ్ళు చూసుకుంటారు. ఆ మూడుకాళ్ళ ముసలావిడ ఘోషలు ఎవరిచెవుల్లోనూ దూరవు. ఎవరి గుండెల్లోనూ జొరబడవు. జొరబడినా కటిక చలితో కరుడుకట్టిన గుండె గోడలను అవి కదిలించలేవు. ఎవళ్ళసౌఖ్యం వాళ్ళదిగా వుంది. స్థలం వదిలి కాలుకదిపితే అమాంతం ఆక్రమించేస్తారు.

చలి కరుస్తూంది. జడి కురుస్తూంది.

"పాపం! మూడుకాళ్ళ ముసలమ్మ." అన్నారు హృదయాంతరాల్లోంచీ ఎవరో ఒక నిట్టూర్పు వడిస్తూ.

పదికాలాల ప్రభావానికి కరిగి- ద్రవమై-ఆవిరై హరించిపోయిన కండలు కదిలిపోగా- ముడతలుబడి మాసిపోయిన చర్మాన్ని ఒక అచ్ఛాదనంగా వేసుకుంది శుష్కించి సన్నబడ్డ ఎముకలమీద. ఒక పేలిక నడుముకు చుట్టుకుంది. ఒక చీలికరొమ్మున వేసుకుంది.

సుడిగాలిలోని ఎండుటాకులా రెపరెపలాడి— గజగజ వణకిపోతోంది ముసలమ్మ! తొడిమ చచ్చి పసుపు పారిన పండుటాకు. ఎముకలు కొరికే చలి. గుండెలు జడిసే జడి.

"అమ్మా!" నాగుండెలోని పూర్వస్మృతి బావురుమంది ఆపరాని ఆవేదనతో.

పెంచి, పెద్దవాణ్ణిచేసి, తన శరీరాన్ని—జీవితాన్ని, నా సౌఖ్యానికీ — ఆనందానికీ — ముక్కలు క్రింద తరిగిపెట్టిన తల్లి ఏదీ?

నా జీవిత లతను పోషించడానికని - కలుపుతీసి-కట్టెలుకొట్టి-కూలిచేసి-కాయలు కాసిన ఆ అమృత హస్తాలు ఎక్కడున్నాయి?

నాకోసం బ్రతికింది.

నాకోసం మరణించింది.

నా పరీక్షల రుసుం కోసం పంపడానికి ముష్టికూళ్ళకుడిచి ముడివేసిన ఏ భైరూపాయలు — ప్రాణం పోతున్నా—జీవుడు విలవిల లాడుతున్నా డాక్టరు కివ్వకుండా—పంపింది. ఆరోగ్యం అడుగంటిపోయినా నా బిడ్డకు తెలియనిస్తే ఎక్కడ పరీక్షలకు దెబ్బతీస్తుందోననే గుబులుకొన్న దిగులుతో తెలుపకుండా కడకు నరసింహాన్నికూడా తెలిపితే ఒట్టు అని వాగ్దానం తీసుకున్నతల్లి ఎక్కడికి వెళ్ళింది?

మరణించిన మరునాడు చేశాడు నరసింహం టెలిగ్రాము. ఆపాటికి పరీక్షలు ముగిశాయి. కాని నాగుండెలో జ్వాలలురేగాయి. చందాలు వసూలుచేసి చదివిన బి. ఏ. ఆనేడు పాసయ్యాను. ఉద్యోగం దొరికింది. ఆర్జన కుదిరింది.

కానీ—'అమ్మ!'

నా పరీక్షలకని నేను పాసై పైకిరావాలని ప్రాణాలు పోతున్నా తెలుపకుండా అసువులు విడిచిన అమరజీవి! కన్నకొడుకు కళ్ళకు మరుగై లోకానికి ఏకాకిని చేసింది.

కళ్ళలో రెండు కన్నీటి ముత్యాలు జల్లుమన్నాయి నాకు.

"ఎక్కడికి కెడుతున్నావు ముసలమ్మా?" జాలిగా అడిగాను. మా అమ్మ నా గుండెల్లో పాతిపోయిన పూర్వస్మృతి పలికించింది నన్ను.

వణకుతూ అంది ఆమె, 'కర్నూలు వెళ్ళాలి నాయనా' ఆ గొంతులో కూడా చలి కొరికింది. గజగజలాడి కుదిసిపోతోంది.

'ఎందుకు?'

'నా కొడుకు పని చేస్తున్నాడు అక్కడ. చూచి రావటానికి వెడుతున్నాను.'

ఏదో అమృతవర్షం అప్లావితం చేసింది నా హృదయాన్ని.

మాతృహృదయం!-ఆ ఆచిన్ని గుండెల్లో అంతలేసి అపార ప్రేమలు ఎక్కడ వుంటాయి! ఈ కళ్ళు కానని ముసలికాలంలో కాళ్ళీడ్చుకుంటూ ఎక్కడో వున్న కొడుకును చూడ్డానికి వెడుతోంది ఈ ముసలమ్మ. స్రుక్కి, శుష్కించిన ఈ ఎముకల్లో యింకా ఆ వ్యామోహం చావలేదు. మాతృప్రేమ!

'ఉదయం నుంచీ జ్వరం పట్టుకుంది నాయనా! ఎముకల్లో సూదుల్లా పొడిచి చంపేస్తోంది. ఈ పాపిష్టి చలి ఒకటి ప్రాణాలు తోడుతోంది.' గజగజ లాడింది ఆ వృద్ధకంఠం.

మా అమ్మ నా హృదయాలలో మాట్లాడినట్టయింది. మృత్యుశయ్యలోంచీ గుండెలు చిలువలు పలువలుగా చలిపోయేమాటలవి.

"ఈ కంబళి కప్పుకో అవ్వా! చలికి జలుబు చేస్తుంది. నేనుకూడా కర్నూలు వస్తున్నాను." హోల్డాల్లోని కంబళి తీసి యిచ్చాను. గుహల్లో వెలుగుతున్న గుడ్డి దీపాల్లా ఆ రెండు కళ్ళూ తృప్తిగా మెరిశాయి.

"పాపం! అర్భకుడు, లోకాన్ని రక్షించేస్తాడు గాబోలు" అన్న ధోరణిలో ముప్ఫై ఆరు కళ్ళు నా వేపు చూశాయి రైలు పెట్టె లోంచీ.

ఉన్ని కంబళి వెచ్చగా కప్పుకుని ముడుచుక కూర్చుంది ముసలమ్మ. వణకుతూన్న గొంతుకతో తడబడుతూ తన జీవిత కథనంతా చెప్పుకొచ్చింది. తన కొడుకు తనమీద ఆసిగి వెళ్ళాడని—రెండేళ్లుగా రాలేదని—చూడ్డానికి వెడుతున్నానంది ముసలమ్మ.

నాగుండె గతుక్కుమంది. కండపుష్టి గుండెపుష్టి ఉండేవరకు మానవుడు మైకం క్రమ్మిన మగతలో ఏమీ తెలుసుకోలేక పోతాడు. కప్పుకొన్న కావరం ఒక్కొక్క పర్యాయం కన్నవారిమీది మమకారాన్నికూడా మరిపింపజేస్తూంటుంది. ఎన్నడో తనను మరచి వెళ్ళిన కొడుకును చూడ్డానికి మూడుకాళ్ళ ముసలమ్మ నడుం ఈడ్చుకుంటూ వెడుతూంది. అతనికి ఆ కలవరమే లేదు. రెండూ హృదయాలే. కానీ ఒకటి అమృత పూరితమైన అమరప్రేమ. మరొకటి కరుడు కట్టిన కావరము.

• • •

కాటుక కరిగి క్రమ్ముకున్నట్లు ఆవరించేసింది పెను చీకటి. హోరుగాలి రొద తగ్గలేదు. వాన తుంపరజడి తరగలేదు. రైలుబండి మాత్రం ధర్మావరం చేరుకుంది.

ఉదయంనుంచీ ఏమీ తిండిలేక పోవడాన ఆకలి మాడ్చేస్తూంది. సూటుకేసు తెరిచి డబ్బులు తీసుకున్నాను ఏదైనా కొనుక్కుందామని. అవ్వ కళ్లు ఆ డబ్బులవైపు ఆప్యాయంగా చూశాయి. "పాపం!" అనిపించింది నాకు జాలిగా మానవుడికి హీనస్థితుల్లో డబ్బు కలిగించే మిరుమిట్లు తలుపులోకి వచ్చి.

"అవ్వా! ఇక్కడే కూర్చుని ఈ వస్తువులు చూస్తూ వుండు. తినడానికి ఏమైనా పట్టుకొస్తాను" అనేసి మఫ్లరు చెవులకు బిగించి రెఫ్రెష్మెంటు హాలుకు నడిచాను.

ఒకే రద్దీగా వుంది ప్లాటుఫారం. ఎక్కేవాళ్లు-దిగేవాళ్లు ఆ వర్షంలో చలిలో గజగజలాడుతున్నారు.

• • •

పులుసన్నం పొట్లం కట్టించుకుని కంపార్టుమెంటులోకి వచ్చాను తొందరగా.

"అవ్వా!"

అవ్వ ఏదీ? ఎక్కడ కెళ్ళింది?

(తరువాయి 14వ పేజీలో)